క్లుప్తంగా

40 శాతం సబ్సిడీతో శనగ విత్తనాలు

పెద్దముడియం : అక్టోబర్‌లో ప్రారంభమయ్యే రబీ సీజన్‌లో మెదటి పంటగా పప్పుశనగ సాగు చేసే రైతులకు 40 శాతం సబ్సిడీతో శనగ విత్తనాలు అందజేస్తున్నట్లు మార్కెట్ యార్డు చైర్మన్ పి.వి.రమణారెడ్డి తెలిపారు. విత్తనాలు కావాల్సిన రైతులు సబ్సిడీ పోను కిలోకు రూ.48.60 చెల్లించాల్సి ఉంటుందన్నారు. ఎకరాకు 20 కిలోల ప్యాకెట్లు రెండు చొప్పున గరిష్టంగా ఐదు ఎకరాలు ఉన్న రైతులకు పది ప్యాకెట్లు అందజేస్తారని తెలిపారు. విత్తనాలు కావాల్సిన రైతులు రైతు భరోసా కేంద్రాల్లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలని తెలిపారు.

నేడు ఎమ్మెల్యే రాక

కమలాపురం : స్థానిక ఎంపీడీఓ కార్యాలయ సభా భవనంలో శుక్రవారం జరిగే మండల సర్వసభ్య సమావేశానికి ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి హాజరు కానున్నారని ఎంపీడీఓ జ్యోతి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. అన్ని శాఖల్లో జరిగిన అభివృద్ధి గురించి చర్చిస్తారని అధికారులు పూర్తి సమాచారంతో హాజరు కావాలని ఆమె తెలిపారు.

రేపు వాహనాల వేలంపాట

పులివెందుల రూరల్ : వివిధ కేసుల్లో పట్టుబడిన వాహనాలకు సంబంధించి ఈనెల 30న పులివెందుల ఎస్ఈబీ కార్యాలయంలో శనివారం ఉదయం 11 గంటలకు వేలంపాట నిర్వహిస్తున్నట్లు ఎస్ఈబీ సీఐ రామాంజనేయనాయక్ తెలిపారు. వేలంపాటలో పాల్గొనేవారు ఆధార్‌కార్డుతో కార్యాలయానికి రావాలన్నారు. వేలంపాటలో వాహనాన్ని దక్కించుకున్న వారు జీఎస్టీ కూడా చెల్లించాలన్నారు.

ఈ పంట నమోదు తప్పనిసరిగా చేసుకోండి

కొండాపురం : ఖరీఫ్ సీజన్‌లో పంట సాగు చేసే రైతులు తప్పనిసరిగా ఈ పంట నమోదు చేసుకోవాలని గురువారం మండల వ్యవసాయ అధికారి ఏవీ రామంజులరెడ్డి తెలిపారు. ఈ పంట నమోదు ఈనెల 30 తేదీలోగా చేయించుకోవాలన్నారు. పంట నమోదు చేయించుకున్న రైతులు ఈకేవైసీ తప్పనిసరిగా చేసుకోవాలన్నారు.

భక్తుల సౌకర్యార్థం షెడ్ ఏర్పాటు



ఆలయం ముందు భాగంలో ఏర్పాటు చేసిన రేకుల షెడ్

వీరపునాయునిపల్లె : మండలంలోని సంతమేశ్వరాలయంలో భక్తుల సౌకర్యార్థం దాతల సహకారంతో రేకులషెడ్ ఏర్పాటు చేసినట్లు ఆలయ చైర్మన్ శివాంజనేయరెడ్డి తెలిపారు. మండలంలోని తాటిమాకులపల్లె గ్రామానికి చెందిన పాలెం చెన్నారెడ్డి జ్ఞాపకార్థం వారి కుటుంబ సభ్యులు రూ.2.5 లక్షలతో షెడ్డును ఏర్పాటు చేశారు. భక్తులకు మరిన్ని సౌకర్యాలు కల్పించేందుకు దాతలు ముందుకు రావాలన్నారు.

వినాయకుడికి ప్రత్యేక పూజలు



వినాయకుడి విగ్రహం వద్ద ఎంవీ మైసూరారెడ్డి

ఎర్రగుంట్ల : పట్టణంలోని నడివూరులో కొలువుదీరిన వినాయకుడికి మాజీ మంత్రి ఎంవీ మైసూరారెడ్డి గురువారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో నడివూరు పెద్దలు పాల్గొని మైసూరారెడ్డితో అభిషేకాలు చేయించారు.

ముగిసిన గణేష్ నిమజ్జనాలు

పులివెందుల టౌన్ : వినాయక చవితి పండుగను పురస్కరించుకుని వాడవాడలలో కొలువుదీరిన గణనాథులను భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించి నిమజ్జనానికి తరలించారు. ఇందులో భాగంగా 11వ రోజు గణేష్ నిమజ్జనాలు గురువారంతో ముగిశాయి. దారిపొడవునా డప్పు వాయిద్యాలతో, రంగులు చల్లుకుంటూ, చిందులు వేస్తూ గణపతిబప్పా మోరియా అంటూ నినాదాలు చేస్తూ నిమజ్జనానికి తరలించారు. ఇందులో మహిళలు ఎంతో ఉత్సాహంగా పాల్గొన్నారు.

పెంపుడు జంతువులకు రేబిస్ వ్యాక్సిన్లు వేయించాలి

ప్రొద్దుటూరు కల్చరల్ : పెంపుడు కుక్కలు, పిల్లులకు యాంటి రేబిస్ వ్యాక్సిన్ వేయించాలని మున్సిపల్ కమిషనర్ వెంకటరమణయ్య, పద్మశాలి కార్పొరేషన్ చైర్‌పర్సన్ జింకా విజయలక్ష్మి తెలిపారు. స్థానిక జీవన జ్యోతి పాఠశాలలో సహదేవ అనిమల్ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో ప్రపంచ రేబిస్ దినోత్సవం సందర్భంగా ఉచితంగా కుక్కలకు, పిల్లులకు యాంటి రేబిస్ టీకాలు వేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రేబిస్ వ్యాధి పట్ల జగ్రత్తగా ఉండాలన్నారు. పశు వైద్య అధ్యాపకుడు డాక్టర్ భాస్కర్ మాట్లాడుతూ పెంపుడు జంతువులకు రేబిస్ వ్యాధి రాకుండా యజమానులు టీకాలు తప్పనిసరిగా వేయించాలన్నారు. కార్యక్రమంలో జీవన జ్యోతి విద్యా సంస్థల వ్యవస్థాపకుడు గురుదేవ్ రామిరెడ్డి, డాక్టర్ రమేష్, పశువైద్య కళాశాల సహాచార్యుడు డాక్టర్ రాంబాబు, లక్ష్మణ కుమార్, మధుసూదన్ రెడ్డి, సతీష్‌కుమార్, డాక్టర్ విజయ్‌కుమార్, మానవత స్వచ్ఛంద సేవా సంస్థ సభ్యులు కళావతి, భాగ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

సచివాలయాలతో ప్రజల వద్దకే పాలన



గ్రామ సచివాలయాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

కొండాపురం : గ్రామ సచివాలయాల వ్యవస్థతో ప్రజల వద్దకే పాలనను తెచ్చిన ఏకైక ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని ఎమ్మెల్యే డాక్టర్ మూలె సుధీర్‌రెడ్డి తెలిపారు. గురువారం మండలంలోని రేగడిపల్లె గ్రామ పంచాయతీలో గ్రామ సచివాలయం, రైతు బరోసా కేంద్రం, విలేజ్ హెల్త్ క్లీనిక్ సెంటర్‌లను ఆయన ప్రారంభించి మాట్లాడారు. ప్రజల సమస్యలు ఆయా గ్రామాల్లోనే పరిస్కరించాలన్న ముఖ్య ఉద్దేశ్యంతోనే గ్రామ సచివాలయం ఏర్పాటు చేశారన్నారు. రాష్ట్రంలో అభివృద్ధితోపాటు పార్టీలకు, కుల, మతాలకు అతీతంగా అర్హత ఉంటే చాలు ప్రతి ఒక్కరికి సంక్షేమ ఫలాలు అందిస్తున్నామన్నారు. రైతులు ఏసీజన్‌లో సాగు చేసిన పంటలకు ఆ సీజన్‌లోనే నష్ట పరిహారం చెల్లిస్తూ రైతులకు ఆసరాగా మన ముఖ్యమంత్రి వైఎస్ జగనన్న నిలిచాడన్నారు. రైతుల కోసం ఎరువులు, విత్తనాలు సబ్సిడీతో అందిస్తూ పెట్టుబడి సాయం కింద రైతు బరోసా ఇస్తూ రైతులకు అండగా నిలచాడన్నారు. గతంలో తెలుగుదేశం ప్రభుత్వంలో కరువు కాటకాలతో రైతులు అప్పుల ఊబిలో చిక్కుకున్నారన్నారు. జగన్న పాలనలో రైతులు ఆర్థికంగా అభివృద్ధి చెందారన్నారు. అనంతరం గ్రామ సచివాలయ మహిళ సిబ్బందికి చీరలు ఆయన పంపిణీ చేశారు వైఎస్సార్‌సీపీ మండల నాయకుడు చింతారాజారెడ్డి సచివాలయ కాంట్రాక్టర్ చదర్ల నిర్మలానందరెడ్డి, మదుసుధన్‌రెడ్డి, జయరామిరెడ్డి, శేఖర్, పెద్దిరెడ్డి, చింతనవ జ్యోత్‌రెడ్డి, గుడ్డం నారాయణరెడ్డి, రామసుబ్బారెడ్డి, రాఘవేంద్రరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రక్షిత తాగునీటి కేంద్రం ప్రారంభం

ముద్దనూరు : స్థానిక కొత్తకొట్టాల వీధిలో గురువారం రక్షిత తాగునీటి పథకాన్ని ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి మాజీ ఎంపీపీ మునిరాజారెడ్డితో కలిసి ప్రారంభించారు. సుమారు రూ.7లక్షల 50వేల వ్యయంతో రక్షిత తాగునీటి సరఫరా కేంద్రాన్ని నిర్మించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యురాలు ఇంద్రాణి, పలువురు వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

ఘనంగా మిలాద్ జెండా ఊరేగింపు



కమలాపురం పెద్ద దర్గాలో జరిగిన జెండా ఊరేగింపులో పాల్గొన్న పీఠాధిపతి



జమ్మలమడుగులో భారీ ర్యాలీ నిర్వహిస్తున్న ఆస్థానయే గౌసియా పీఠాధిపతి

కమలాపురం : జష్నే మిలాద్–ఉన్–నబి జెండా ఊరేగింపు ఘనంగా నిర్వహించారు. గురువారం పీఠాధిపతి శ్రీ హజరత్ ఫైజుల్ గఫార్ షా ఖాద్రి ఆధ్వర్యంలో ఆస్థాన–ఏ–జహీరియా నుంచి దర్గా–ఏ–గఫారియా వరకు మిలాద్–ఉన్–నబి జెండా ఊరేగింపు అశేష భక్త జన సందోహం నడుమ భక్తి శ్రద్ధలతో వైభవంగా నిర్వహించారు. బాణా సంచా కాల్చుతూ డప్పు వాయిద్యాలు, మేళ తాళాలతో ఊరేగింపు సాగింది. నారె–ఏ–తక్బీర్.. అల్లాహు అక్బర్, యా పీర్.. యా గౌస్.. అనే నారాలతో, ఖసీదా ఖానాలతో ఊరేగింపు వైభవంగా సాగింది. అనంతరం పెద్ద దర్గా ఆవరణలో మిలాద్ జెండాను పీఠాధిపతి ప్రతిష్ఠంచారు. స్వాముల వారి మజార్లపై పూల చాదర్లు సమర్పించి, ప్రత్యేక ఫాతెహ చేశారు. వివిధ ప్రాంతాల నుంచి తరలి వచ్చిన అశేష భక్త జన సందోహానికి అన్నదానం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో పీఠాధిపతి సోదరులు దస్తగిరిస్వామి, మౌలానాస్వామి, గౌస్‌పాక్, జియా, ఇస్మాయిల్, సర్ఫరాజ్, పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. అలాగే కుమ్మరివీధిలో వెలసిన తాళిం, తూర్పు వీధిలో వెలసిన జెండా చెట్టు వద్ద ఆ కాలనీల యూత్ ఆధ్వర్యంలో భక్తి శ్రద్ధలతో మిలాద్ వేడుకలు నిర్వహించారు. మత పెద్దలు ఖాసిదాఖాన నిర్వహించారు. అలాగే జష్న్–ఏ–మీలాద్‌ను పురస్కరించుకుని వైఎస్సార్ సీపీ యువ నాయకుడు ఇస్మాయిల్ ఆధ్వర్యంలో ముస్లిం యువత బైక్ ర్యాలీ నిర్వహించారు. దర్గా నుంచి క్రాస్ రోడ్డు వరకు తిరిగి దర్గా వరకు బైక్ ర్యాలీ నిర్వహించి ఒకరికొకరు మిలాదున్నబీ శుభాకాంక్షలు తెలుపుకున్నారు.

జమ్మలమడుగులో..

జమ్మలమడుగు : మహమ్మద్ ప్రవక్త జన్మదినమైన మిలాద్‌నబీ సందర్భంగా పట్టణంలోని ఆస్థానయే గౌసియా పీఠాధిపతి సయ్యద్‌షా గౌస్‌పీరాఖాద్రీ, జామియా మసీదు పీఠాధిపతి సయ్యద్‌షా సాదిక్‌పాషాఖాద్రీలు గురువారం భారీ ర్యాలీలు నిర్వహించారు. ఈ ర్యాలీకి ముఖ్య అతిథిగా ఆర్డీఓ జి.శ్రీనివాసులు హాజరయ్యారు. సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి ఒక్కరు సన్మార్గంలో నడవడం వల్ల మనసుకు ప్రశాంతతోపాటు విలువలతో కూడిన జీవనాన్ని సాగించవచ్చునన్నారు. కార్యక్రమంలో సయ్యద్‌షా తాహీర్‌పీరాఖాద్రీ, సయ్యద్‌సా అత్తహార్ ఖాద్రీ, మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ ముల్లాజానీ, మహమ్మద్ గౌస్ తదితరులు పాల్గొన్నారు.

జూదరుల అరెస్టు

సింహాద్రిపురం : మండలంలోని వై.కొత్తపల్లె గ్రామానికి చెందిన నలుగురు జూదరులను గురువారం అరెస్టు చేసి వారినుంచి రూ.5300లు నగదును స్వాధీనం చేసుకుని వారిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ రోషన్ తెలిపారు. గ్రామంలో తూర్పువైపున కంపచెట్లలో జూదం ఆడుతున్నట్లు సమాచారం రావడంతో సిబ్బందితో దాడిచేశామని ఎస్ఐ తెలిపారు. ఎక్కడైనా జూదం ఆడుతూ ఉంటే సమాచా రం అందించాలని సమాచారం ఇచ్చిన వారికి బహుమతి ఇచ్చి, వారి పేరు గోప్యంగా ఉంచుతామన్నారు.

పాపాఘ్ని నీరు చెరువులకు మళ్లింపు



లేటపల్లె వద్ద వరద నీటిని జేసీబీతో మళ్లిస్తున్న దృశ్యం

కమలాపురం : మండలంలోని టి.చదిపిరాళ్ల, కమలాపురం చెరువులకు పాపాఘ్ని నది నుంచి వరద నీటిని మళ్లించారు. గురువారం ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి ఆదేశాల మేరకు వైఎస్సార్ సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి పీవీ క్రిష్టారెడ్డి లేటపల్లె సమీపంలో పాపాఘ్ని నదిలో పారుతున్న వరద నీటిని జేసీబీ ద్వారా చదిపిరాళ్ల, కమలాపురం చెరువులకు మళ్లించారు. రబీ సీజన్ ప్రారంభంలోనే వర్షాలు కురవడంతో ఆ నీటిని చెరువులకు మళ్లిస్తే రైతులు పంటలు సాగు చేసుకునే అవకాశం ఉండటంతో చెరువులకు నీళ్లు మళ్లించామని క్రిష్టారెడ్డి తెలిపారు.

రాజధాని పేరుతో అక్రమాలు

కడప కార్పొరేషన్: అమరావతి రాజధాని పేరుతో అప్పటి ముఖ్యమంత్రి చంద్రబాబు, ఆయన తనయుడు లోకేష్ అనేక అక్రమాలకు పాల్పడ్డారని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి అఫ్జల్‌ఖాన్ అన్నారు. గురువారం తన కార్యాలయంలో విలేకరులతో ఆయన మాట్లాడారు. ఇన్నర్ రింగ్ రోడ్డు విషయంలో అనేక అక్రమాలు చోటు చేసుకున్నాయన్నారు. వీటన్నింటినీ సీఐడి గుర్తించిందన్నారు. అసైన్డ్ రైతుల నుంచి భూములు బలవంతంగా లాక్కున్నారని, వారి పేర్లతో వచ్చిన ప్లాట్లను కూడా వీరే కాజేశారన్నారు. రాజధాని ముసు గులో వందల ఎకరాలను దోచుకొని వీరు సాగించిన దోపిడీ ఇప్పుడు బయటపడుతోందన్నారు. లోకేష్ కూడా జైలుకెళ్లడం తథ్యమన్నారు.

మత సామరస్యాన్ని ప్రబోధించిన మహా ప్రవక్త

కడప కల్చరల్ : మానవ ప్రపంచానికి మహా ప్రవక్త మహమ్మద్ మత సామరస్యాన్ని ప్రబోధించారని డిప్యూటీ సీఎం ఎస్‌బీ అంజాద్‌బాష అన్నారు. గురువారం అమీన్ హాస్పిటల్ వద్ద ఎండీ నయీమ్ ఆధ్వర్యంలో మిలాదున్నబీ సందర్భంగా అన్నదానం నిర్వహించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన డిప్యూటీ సీఎం అంజద్‌బాష మాట్లాడుతూ మహా ప్రవక్త జన్మదినాన్ని పురస్కరించుకొని ముస్లింలు వేడుకలు నిర్వహించుకుంటున్నారన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు జడ్పీ విద్యార్థుల ఎంపిక



రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు



రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన లిటిల్ ఫ్లవర్ హైస్కూల్ విద్యార్థులు

వేంపల్లె : రాష్ట్రస్థాయి హ్యాండ్‌బాల్ పోటీలకు జిల్లాపరిషత్ బాలుర ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులు ఎంపికైనట్లు పీడీ రాజశేఖర్ తెలిపారు. ఈనెల 29, 30, అక్టోబర్ 1వ తేదీలలో గుంటూరు జిల్లా లోని తెనాలిలో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారన్నారు. అండర్–17 విభాగంలో ఆదిశేషారెడ్డి, వెంకట శ్రీరామ్, విష్ణువర్ధన్, మహేష్, నాగేష్, పునేష్‌కుమార్‌లు ఈ పోటీల్లో పాల్గొననున్నారు. అండర్–14 విభాగంలో శ్రావణ్, నాగచరణ్, సంజయ్, మోహన్‌సాయి, మిథున్‌లు ఎంపికయ్యారన్నారు. వచ్చే నెలలో జరుగనున్న రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారన్నారు. ఎంపికపై ప్రధానోపాధ్యాయులు శివమునెమ్మ హర్షం వ్యక్తం చేశారు.

రాష్ట్రపోటీలకు ఎంపికైన లిటిల్ ఫ్లవర్ విద్యార్థులు

రాష్ట్రస్థాయి హ్యాండ్‌బాల్ పోటీలకు లిటిల్ ఫ్లవర్ హైస్కూల్ విద్యార్థులు ఎంపికైనట్లు కరస్పాండెంట్ డా.ఎస్.ఎఫ్.బాషా హర్షం వ్యక్తం చేశారు. జడ్పీ హైస్కూల్ క్రీడా మైదానంలో జరిగిన హ్యాండ్‌బాల్ పోటీల్లో అండర్–14 విభాగంలో సయ్యద్‌సారా, రెడ్డయ్యలు రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొని మంచి ప్రతిభ చూపాలన్నారు.

వివిధ జిల్లాస్థాయి పోటీలకు ఎంపిక

రెండు రోజులుగా ఎస్జీఎఫ్ ఆధ్వర్యంలో నిర్వహించిన వివిధ క్రీడల్లో జిల్లాస్థాయి పోటీలకు లిటిల్ ఫ్లవర్ హైస్కూల్ విద్యార్థులు వినయ్‌కుమార్, జిక్రా స్వాలేహ, అదిబా, సమీర్, మహమ్మద్ అఖిల్‌లు వివిధ క్రీడల్లో రాణించి అర్హత సాధించారు. ఎంపికైన విద్యార్థులను కరస్పాండెంట్ డా.ఎస్.ఎఫ్.బాషా, ప్రిన్సిపాల్ ముబీనా అభినందించారు.

జగనన్న సురక్ష సర్వే పరిశీలన



జగనన్న సురక్ష సర్వేను పరిశీలిస్తున్న వైఎస్ మనోహర్‌రెడ్డి, తదితరులు

పులివెందుల టౌన్ : స్థానిక మున్సిపాలిటీ పరిధిలో జరుగుతున్న జగనన్న సురక్ష సర్వే కార్యక్రమాన్ని గురువారం మున్సిపల్ ఇన్‌చార్జి వైఎస్ మనోహర్ రెడ్డి మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్, కమిషనర్ నరసింహారెడ్డిలతో కలిసి పరిశీలించారు. సీహెచ్ఓ, ఏఎన్ఎం, వలంటీర్‌లు ప్రతి ఇంటికి వెళ్లి ప్రజలకు ఉచిత వైద్య పరీక్షలు నిర్వహించి ఆరోగ్యంపై అవగాహన కల్పించాలన్నారు. ఇంటివద్దే మెడికల్ స్క్రీనింగ్ నిర్వహించడంతో పాటు 7 రకాల పరీక్షలు చేస్తారన్నారు. దీంతో ప్రజలకు మెరుగైన వైద్యసేవలు అందుతాయన్నారు. కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ మురళీధర్, వార్డు సచివాలయ సిబ్బంది, వలంటీర్‌లు పాల్గొన్నారు.

ప్లాంట్ తనిఖీ

స్థానిక శిల్పారామం వద్ద ఏర్పాటు చేసిన సీవరేజ్ ట్రీట్మెంట్ ప్లాంటును గురువారం మున్సిపల్ ఇన్‌చార్జి వైఎస్ మనోహర్‌రెడ్డి మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్, కమిషనర్ నరసింహారెడ్డిలతో కలిసి తనిఖీ చేసి మోటార్ల పనితీరును పరిశీలించారు. సిబ్బంది అప్రమత్తంగా ఉండి మోటార్ల నిర్వహణలో ఏవైనా లోపం వస్తే వెంటనే తమ దృష్టికి తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో ఇంజనీరింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

రేపటి నుంచి జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాలు

వీరపునాయునిపల్లె : మండల పరిధిలోని 15 సచివాలయాల్లో ఈనెల 30వ తేదీ నుంచి అక్టోబర్ 19వ తేదీ వరకు జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిర్వహించనున్నట్లు మండల అభివృద్ధి అధికారి చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు. గురువారం ఆయన తమ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ కార్యక్రమ వివరాలను తెలియజేశారు. 30న ఉరుటూరు సచివాలయం, 2, 3న ఎస్.పాలగిరి, 4న తలపనూరు, 5న గంగిరెడ్డిపల్లె, 6న ఇందుకూరు, 9న యు.రాజుపాలెం, 10న కొమ్మద్ది, 11న మొయిళ్లచెరువు, 12న ఎస్ పాలగిరి, 16న అనిమెల, 17న వెల్దుర్తి, 18న ఉరుటూరు1, 19న అలిదెన సచివాలయాల్లో నిర్వహిస్తారన్నారు. కార్యక్రమంలో మండల వైద్యాధికారులు మహమ్మద్ తాహ, జ్యోతి పాల్గొంటారని ఆయన తెలిపారు. ఈ అవకాశాన్ని మండల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

ముమ్మరంగా జగనన్న ఆరోగ్య సురక్ష సర్వే

సింహాద్రిపురం : ప్రతి కుటుంబానికి వైద్యం అందించాలని ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో భాగంగా గురువారం గురిజాలలో ఇంటింటా జేఏఎస్ సర్వే ప్రారంభించారు. జగనన్న సురక్ష సర్వే ద్వారా ప్రతి ఇంటికి వెళ్లి ఇంటిలోని ప్రతి ఒక్కరికి బీపీ, షుగర్, హిమోగ్లోబిన్, తదితర పరీక్షలు నిర్వహించారు. వారిలో ఏవైనా అనారోగ్య సమస్యలుంటే వారి వివరాలతో కూడిన కార్డును అందజేసి హెల్త్ క్యాంపులో ఆరోగ్య సమస్యలను తీర్చడంతో పాటు ఉచితంగా వైద్యం, మందులు అందజేస్తున్నారు. కార్యక్ర మంలో సీహెచ్ఓ లీలా, ఆశాకార్యకర్త పద్మావతి, వలంటీర్లు, తదితరులు పాల్గొన్నారు.

మార్కెట్‌కు తరలివస్తున్న చీనీకాయలు



వేలంపాటను పర్యవేక్షిస్తున్న మార్కెట్ యార్డు చైర్మన్ చిన్నప్ప

పులివెందుల రూరల్ : స్థానిక వ్యవసాయ మార్కెట్‌యార్డుకు రైతులు పండించిన చీనీకాయలను తీసుకుని వచ్చి విక్రయాలు చేయడానికి ఆసక్తి చూపుతున్నారని వ్యవసాయ మార్కెట్‌యార్డు చైర్మన్ చిన్నప్ప అన్నారు. గురువారం పులివెందుల వ్యవసాయ మార్కెట్‌కు నియోజకవర్గంలోని వివిధ గ్రామాల నుంచి సుమారు 70 టన్నుల చీనీ కాయలు మార్కెట్‌యార్డుకు వచ్చాయన్నారు. సూట్ లేకుండా చీనీ విక్రయాలు చేసుకునేందుగా పులివెందుల వ్యవసాయ మార్కెట్ ఎంతో ఉపయోగపడుతుందన్నారు. మార్కెట్‌యార్డులో చీనీ టన్ను ధర రూ.24వేలు పలికినట్లు ఆయన తెలిపారు. మార్కెట్‌యార్డులోని కేంద్రాల వద్దకు చీనీకాయలు తీసుకువచ్చే రైతులకు అన్ని మౌలిక సదుపాయాలను కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి, పాడా ఓఎస్‌డీ అనిల్‌కుమార్‌రెడ్డిల ఆదేశాలమేరకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. అనంతపురం చీనీ మార్కెట్ కంటే పులివెందులలోని చీనీ మార్కెట్‌లోనే అధిక ధరలకు చీనీకాయలను కొనుగోలు చేస్తున్నారన్నారు.

ఎంఎస్ స్వామినాథన్ మృతి బాధాకరం



ఎంఎస్ స్వామినాథన్ చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న సంబటూరు ప్రసాద్‌రెడ్డి

కమలాపురం : హరిత విప్లవ పితామహుడు ఎంఎస్ స్వామినాథన్ మృతి రైతు లోకానికి తీరని లోటని హార్టికల్చర్ స్టేట్ అడ్వైజర్ సంబటూరు ప్రసాద్‌రెడ్డి తెలిపారు. గురువారం ఆయన స్థానిక వైఎస్సార్ సీపీ కార్యాలయంలో ఎంఎస్ స్వామినాథన్ చిత్రపటానికి నివాళులర్పించి మాట్లాడారు. ఆహార వృద్ధిలో భారత్ స్వయం సమృద్ధి సాధించేందుకు స్వామినాథన్ చేసి కృషి ఎనలేనిదన్నారు. తన పరిశోధనలతో అనేక రకాల వరి వంగడాలు సృష్టించారన్నారు. ప్రపంచంలో ఆకలి, పేదరికం తగ్గించడంపై ఆయన ప్రత్యేక దృష్టి సారించారన్నారు. ఇతర దేశాలకు చెందిన ఎన్నో రకాల మేలైన వరి రకాలను మనదేశంలోకి ప్రవేశ పెట్టి, వాటి నుంచి కొత్త వరి రకాలను ఉత్పత్తి చేశాడన్నారు. ఆ సేవల ద్వారా పద్మశ్రీ, పద్మ భూషణ్, పద్మ విభూషణ్, రామన్ మెగసెసె లాంటి ఎన్నో పురస్కారాలను అందుకున్నాడని గుర్తు చేశారు. అలాగే ఏపీ రైతాంగ సమాఖ్య అధ్యక్షుడు, కృష్ణా గోదావరి, పెన్నా డెల్టా డ్రైనేజ్ బోర్డు మాజీ సభ్యుడు యెర్నేని నాగేంద్రనాథ్ (చిట్టిబాబు) హఠాన్మరణం రైతు లోకానికి తీరని లోటన్నారు. ఆయన మృతి పట్ల శ్రద్ధాంజలి ఘటించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు సీఎస్ నారాయణరెడ్డి, ఎన్‌సీ పుల్లారెడ్డి, సాదిక్, మస్తానయ్య, నాగేశ్వర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా భగత్‌సింగ్ జయంతి



జమ్మలమడుగు : భగత్ సింగ్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న విద్యార్థి సంఘ నాయకులు

వేంపల్లె : విప్లవవీరుడు షహీద్ భగత్‌సింగ్ 116వ జయంతి వేడుకలను ఆమ్‌ఆద్మీపార్టీ నాయకులు ఘనంగా నిర్వహించారు. గురువారం ఆ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు దాదాపీర్, నాయకులు భగత్‌సింగ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. 23 సంవత్సరాలకే ప్రాణత్యాగం చేసి ఇంక్విలాబ్ జిందాబాద్ నినాదాన్ని ప్రపంచానికి పరిచయం చేశారన్నారు. నేటి తరానికి భగత్‌సింగ్ లాంటి మహాత్ముల జీవితాలు ఆదర్శమని, దేశభక్తిని నింపుకుని ప్రాణాలను అర్పించిన మహాపురుషుడని కీర్తించారు. భగత్‌సింగ్ ఆశయాలను నెరవేర్చే విధంగా యువత ముందుకు రావాలని పిలుపునిచ్చారు.

జమ్మలమడుగులో..

జమ్మలమడుగు : విద్యార్థుల్లో విప్లవ చైతన్యం రగిల్చిన విప్లవ కెరటం భగత్‌సింగ్ అని ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు వినయ్‌కుమార్ తెలిపారు. గురువారం భగత్ సింగ్ 116వ జయంతి సందర్భంగా ఎస్సీ బాలుర వసతి గృహంలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. భగత్ సింగ్ స్ఫూర్తి నేటి యువత ఆదర్శంగా తీసుకుని పోరాటాలకు ముందుకు రావాలని సూచించారు.

చిన్నచిన్న విషయాలకు గొడవలు పడకండి



తిప్పలూరులో ఇరువర్గాలతో మాట్లాడుతున్న డిఎస్పీ నాగరాజు, తహసీల్దార్ నాగేశ్వరరావు

ఎర్రగుంట్ల : చిన్న చిన్న విషయాలకు గొడవలు పడి గ్రామంలో ప్రశాంతతను దెబ్బతియకూడదని ఇరు వర్గాలకు జమ్మలమడుగు డీఎస్పీ నాగరాజు గురువారం కౌన్సిలింగ్ చేశారు. గురువారం తిప్పలూరు గ్రామంలో ఎర్రగుంట్ల తహసీల్దార్ నాగేశ్వరరావు, పట్టణ సీఐ ఈశ్వరయ్యలతో కలిసి ఆయన పర్యటించారు. వినాయక నిమజ్జనం విషయంలో డప్పు వాయిద్యాల, బాణసంచా వల్ల కొంత అపోహలు రావడంతో దళితులకు, అగ్రవర్ణాలకు మనస్పార్థలు వచ్చాయన్నారు. దీంతో తమకు న్యాయం చేయాలని దళితులు ఎర్రగుంట్ల పట్టణంలోని నాలుగురోడ్ల కూడలిలో ధర్నా చేపట్టారు. వీరి మధ్య వచ్చిన అపోహలను తొలగించేందుకు పోలీస్‌స్టేషన్‌కు ఇరువర్గాలను పిలిపించి కౌన్సిలింగ్ అందించారు. గ్రామంలో ఏ చిన్న ఉత్సవం కానీ, మరే ఇతర విషయాలు జరిగినా అనుమతులు తప్పనిసరిగా తీసుకోవాలని డీఎస్పీ సూచించారు. గ్రామంలో వారం రోజులు పాటు పికెటింగ్‌ను పోలీసులు పెట్టినట్లు తహసీల్దార్ నాగేశ్వరరావు తెలిపారు.

'బీటెక్ రవి.. ఆరోపణలు మానుకో'

పులివెందుల టౌన్ : టీడీపీ నాయకులు బీటెక్ రవి అబద్ధపు ఆరోపణలు మానుకుని మాట్లాడితే బాగుంటుందని 4వ వార్డు కౌన్సిలర్ పార్నపల్లి కిశోర్ అన్నారు. గురువారం ఆయన పులివెందులలో విలేకరులతో మాట్లాడుతూ బీటెక్ రవి గురించి నిజానిజాలు మాట్లాడే వైఎస్సార్‌సీపీ నాయకులకు, మిమ్మల్ని ధీటుగా విమర్శించే వాళ్లకు గత టీడీపీ ప్రభుత్వంలో ఎంత మందికి నీవు సీఎం రిలీఫ్ ఫండ్ ఫేక్ చెక్కులు ఇప్పించ్చావో తెలపాలన్నారు. స్కాంలే కాదు ఫేక్ చెక్‌లు సృష్టించడం కూడా నీకు బాగా తెలిసినట్లుందన్నారు. గత టీడీపీ ప్రభుత్వంలో నేను నిజంగా మీ కార్యాలయానికి వచ్చి చెక్ తీసుకున్న దాఖలాలు, అప్లికేషన్ మీకు ఇచ్చిన ఫొటోలు ఉంటే నిరూపించాలన్నారు. నువ్వే కాదు బీటెక్ చదివింది. నేను కూడా బీటెక్ చదివానని, నాకు చెక్కు వచ్చి ఉంటే నువ్వేమైనా మార్పుకున్నావా లేక నా పేరు చెప్పుకుని మీ కార్యకర్తలు మెక్కితిన్నారా అని విమర్శించారు. నీలాంటి దద్దమ్మల ఆరోపణలకు భయపడే ప్రసక్తే లేదన్నారు. ఒక కౌన్సిలర్‌నైన నన్ను కూడా ధైర్యంగా ఎదుర్కోలేక ఆరోపణలు చేసే స్థాయికి దిగజారిపోయావని ఎద్దేవా చేశారు.

జిల్లా స్థాయికి ఎంపికైన విద్యార్థులు



జిల్లాస్థాయికి ఎంపికైన విద్యార్థినులతో కరస్పాండెంట్ చక్రపాణిరెడ్డి, పీఈటీ

వేంపల్లె : పులివెందుల రవణప్ప సత్రం పాఠశాలలో జరిగిన క్రీడాపోటీలలో వేంపల్లె శ్రీచైతన్య విద్యార్థులు జోనల్‌స్థాయి నుంచి జిల్లాస్థాయికి ఎంపికైనట్లు ఆ పాఠశాల కరస్పాండెంట్ బి.చక్రపాణిరెడ్డి తెలిపారు. అండర్–14 బాలికల విభాగంలో ఖోఖో క్రీడల్లో ఇద్దరు, అండర్–17 బాలికల విభాగంలో ఖోఖో క్రీడల్లో ముగ్గురు, త్రోబాల్‌లో ఒక విద్యార్థిని తమ ప్రతిభను చాటుకుని జిల్లాస్థాయికి ఎంపికవ్వడం పట్ల కరస్పాండెంట్‌తో పాటు డైరెక్టర్స్ చేతన్‌రెడ్డి, చైతన్యరెడ్డి, పీఈటీ టీచర్స్, ఉపాధ్యాయులు విద్యార్థులను అభినందించారు.

పెద్దదర్గాలో అన్నదానం

కడప కల్చరల్ : మహా ప్రవక్త మహమ్మద్ (సా.అ.వ) పవిత్ర జన్మదినోత్సవాన్ని పురస్కరించుకుని గురువారం కడప నగరమంతటా 50కు పైగా ప్రాంతాలలో భారీగా అన్నదానా లు నిర్వహించారు. ప్రధానంగా కడప అమీన్‌పీర్ (పెద్ద)దర్గాలో బార్మి అన్నదానం నిర్వహించారు. దర్గా పీఠాధిపతి హజరత్ సయ్యద్‌షా ఆరీఫుల్లా హుసేనీ సాహెబ్ ఆశీస్సులతో దర్గా భక్తులు పెద్ద సంఖ్యలో తెల్లవారుజాము నుంచి దర్గా ప్రాంగణంలో అన్నప్రసాద పంపిణీకి ఏర్పాట్లు చేశారు. నగరం నలుమూలల నుంచి భక్తులు కార్యక్రమానికి హాజరయ్యారు.